క్లుప్తంగా

హోమియో వైద్యుడికి అవార్డు



ఇండియన్ స్టార్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ అరుణ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అరుణ్‌కు ఇంటర్నేషనల్ ఎక్స్‌క్లూజివ్ స్టార్ అవార్డ్స్ వారు ఇండియన్ స్టార్ ఐకాన్ అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు హైదరాబాద్ ప్రముఖులు, సినీప్రముఖుల నడుమ అవార్డును అందజేశారు. ఇంటిగ్రేటెడ్ మెడికల్ రీసెర్చ్, సోషల్ సరీ్వసెస్ కేటగిరిలో తనకు ఈ అవార్డు అందజేసినట్లు డాక్టర్ అరుణ్ తెలిపారు.

నగరపాలకలో ఓటర్ల జాబితా ప్రదర్శన

కర్నూలు (టౌన్): స్థానిక సంస్థలకు సంబంధించి ఓటర్ల జాబితాను ఆదివారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి (స్థానిక సంస్థలు) ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేసినట్లు వెల్లడించారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): కంటి వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక 1వ వార్డు చిదంబరరావు వీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర భాగాల్లో కళ్లకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వీటి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. పేదల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షాషా వలి, పార్టీ నాయకులు షేక్షావలి, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేదాస్ సిల్క్స్ షోరూం ప్రారంభం



వేదాస్ పట్టు చీరల షోరూంను ప్రారంభిస్తున్న కాటసాని జయమ్మ

కర్నూలు (టౌన్): నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న స్కందాన్షీ కాంప్లెక్స్‌లో ఆదివారం వేదాస్ సిల్క్స్ పట్టు చీరల షోరూంను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ అతిథిగా హాజరై పూజ కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేదాస్ పేరుతో ప్రారంభించిన పట్టుచీరల షోరూంలో మహిళలు మెచ్చే విధంగా పట్టు చీరలు, ఫ్యాన్సీ, సిల్క్స్ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళల అభిరుచులుగా తగ్గట్టుగా ఎన్నో వందల రకాల చీరలు ఉన్నాయన్నారు. మహిళలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సింహ్మాని ఈశ్వరయ్య, సింహాృని శివ వెంకటదాస్, పోల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15న శ్రీఅవధూత రామిరెడ్డి తాత మహోత్సవం

కోడుమూరు: మండలంలోని అనుగొండ గ్రామంలో వెలసిన శ్రీఅవధూతరామిరెడ్డి తాత తిరుణాల మహోత్సవాన్ని ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు తాత సేవాసంస్థాన్ సభ్యులు రామచంద్రారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తాత సన్నిధిలో మేలుకొలుపు, సుప్రభాతం, పంచామృతాభిషేకం, అర్చన, మహామంగళహారతి, మధ్యాహ్నం శ్రీరామిరెడ్డి తాతగారి కాంస్య విగ్రహ శోభాయాత్ర, చెక్క భజన, అన్నదానం, సాయంత్రం సంధ్యా హారతి కార్యక్రమాలు చేపడతామని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

16న బండలాగుడు పోటీలు

తాత తిరుణాలను పురస్కరించుకుని గ్రామంలో 16వ తేదీన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రామచంద్రారెడ్డి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతిగా రూ.30,016, రెండో బహుమతిగా రూ.22,016, మూడో బహుమతిగా రూ.17,016, నాలుగో బహుమతిగా రూ.12,016, ఐదో బహుమతిగా రూ. 9,016, ఆరో బహుమతిగా రూ.6,016ను దాతల సహకారంతో అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో సమూల మార్పులు!

- తూకాల పర్యవేక్షణకు 4 టీమ్‌ల ఏర్పాటు
- వాము పొట్టు ప్రాసెసింగ్ ద్వారా మార్కెట్‌కు ఆదాయం
- పాలకవర్గం చొరవతో మార్కెట్ కమిటీకి పెరుగుతున్న ఆదాయం





మార్కెట్ కమిటీ కార్యాలయం, (ఇన్‌సెట్) మార్కెట్ కమిటీలో తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలకవర్గం వివిధ మార్పులకు శ్రీకారం చుట్టింది. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రైతులను దగా చేయకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు యార్డును నాలుగు బ్లాకులుగా విభజించి నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌ల్లో సూపర్‌వైజర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, యార్డు అసిస్టెంట్లు ఉన్నారు. ప్రతి రోజు ఈ టీమ్‌లు మార్కెట్‌లో తిరుగుతూ.. తూకాలను పర్యవేక్షిస్తున్నారు. కమీషన్ ఏజెంట్లు ప్రతి రైతుకు ఈ–నామ్ కంప్యూటరైజ్డ్ తక్‌పట్టీలు ఇచ్చే విధంగా చూస్తారు. మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది మార్కెట్‌లో తిరుగుతుండటంతో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారులు అప్రమత్తమయ్యారు. క్రమంగా రైతులకు కంప్యూటరైజ్డ్ ఈ–నామ్ తక్‌పట్టీలు ఇవ్వడం అలవాటు చేసుకుంటున్నారు. ఇటీవలి వరకు తెల్లపేపరుపై వివరాలు రాసి ఇవ్వడం జరిగేది. ఇప్పటికి కొంత తెల్లపేపరుపైనే ఇస్తున్నారు. అయితే ఇలా ఇవ్వడం తగ్గింది.

వాము పొట్టు ప్రాసెసింగ్‌కు ప్రతి నెలా రూ.80 వేలు

మార్కెట్ యార్డులో వాము పొట్టును ప్రాసెసింగ్ చేసుకోవడం ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరే విధంగా పాలక వర్గం చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చర్యలు తీసుకోవడం విశేషం. గత ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు కొంతమంది వ్యాపారులు రైతుల దగ్గర వాము పొట్టు కొని మార్కెట్ యార్డులో ప్రాసెసింగ్ చేసుకునే వారు. దీని వల్ల మార్కెట్ కమిటీకి రూపాయి ఆదాయం కూడా వచ్చేది కాదు. అయితే గతంలో పనిచేసిన మార్కెట్ కమిటీ అధికారులకు భారీగా ముడుపులు ముట్టేవి. అయితే ప్రస్తుత పాలకవర్గం వాము పొట్టు ప్రాసెసింగ్ చేసుకోవడం ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకుంది. పొట్టు నుంచి వాము తీసే వ్యాపారులు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ప్రతి నెల రూ.80 వేలు మార్కెట్ కమిటీకి చెల్లించాలి, ఈ మొత్తాన్ని మార్కెట్ యార్డు అభివృద్ధికి ఖర్చు చేస్తారు.

ప్రతి పునా గడ్డల లారీకి రూ.3 వేలు :

మార్కెట్‌యార్డులోని కూరగాయల మార్కెట్ ద్వారా గతంలో తూతూ మంత్రంగా ఆదాయం వచ్చేది. అక్రమాలు అరికట్టడం, సర్వీస్ చార్జీ వసూలు ద్వారా ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచడం విశేషం. మార్కెట్ యార్డుకు కొంతమంది వ్యాపారులు ఆలుగడ్డలు తెప్పించి ఇక్కడి నుంచి వ్యాపారులకు పంపేవారు. దీని నుంచి కూడా మార్కెట్ కమిటీకి ఆదాయం ఉండేది కాదు. మార్కెట్‌కు వచ్చే ఆలుగడ్డల ద్వారా ప్రతి లారీకి రూ.2250 చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. మార్కెట్‌కు స్థానికంగా పండించిన ఉల్లి రావడం తగ్గినపుడు వ్యాపారులు పూనా గడ్డలు తెప్పిస్తారు. వీటి నుంచి కూడా మార్కెట్‌కు ఆదాయం వచ్చేది కాదు. అయితే ఇపుడు ప్రతి లారీ పునా గడ్డలకు రూ.3000 ప్రకారం మార్కెట్ కమిటీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం విశేషం.

ఆదాయం పెరుగుతోంది



కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం తీసుకున్న చర్యల వల్ల ఆదాయం పెరుగుతోంది. గతంలో అనధికారికంగా జరుగుతున్న వాటిని పాలక వర్గం క్రమబద్ధీకరించడం ద్వారా మార్కెట్ ఆదాయం పెరగడానికి దోహదపడుతోంది. మార్కెట్‌లో రైతులు తూకాల్లో గాని, ఇతరత్రా కాని దగాకు గురి కాకుండా పాలక వర్గం ఆదేశాల మేరకు నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేశాము. మార్కెట్‌లో తూకాలు మొదలైనప్పటి నుంచి ర్యాండమ్‌గా తనిఖీలు చేపడుతున్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం తీసుకున్న చొరవ వల్ల రూ.10 లక్షల వరకు ఆదాయం పెరిగే అవకాశం ఏర్పడింది.

–గోవిందు, ఎంపిక శ్రేణి సెక్రటరీ, మార్కెట్ కమిటీ, కర్నూలు

శివ స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీమోహన్‌రెడ్డి దంపతులు

కర్నూలు(సెంట్రల్): చాణిక్యపురి అయ్యప్పస్వామి దేవాలయంలో శివస్వాములకు రమేష్ అనే వ్యక్తి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయ మనోహరి హాజరై స్వాములకు భోజనాన్ని వడ్డించారు. భక్తి భావంతో ఉన్న స్వాములకు అన్నదానం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.

జీవనశైలి మార్పులతోనే వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పుల వల్లే పలు వ్యాధులు వస్తున్నాయని హైదరాబాద్ యశోదా హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీకృష్ణ, ఆర్థోపెడిస్ట్ డాక్టర్ రాజశేఖర్ చెప్పారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని స్కంధాన్ని కాంప్లెక్స్‌లో ఉద్యోగులకు ఆ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉద్యోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో, ఎముకల సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మితంలేని ఆహారం వల్ల గుండెజబ్బులు, ఊబకాయం, కీళ్లనొప్పులు, బీపీ, షుగర్ పెరుగుతున్నాయని చెప్పారు. వీటిని నియంత్రణలో ఉంచుకోవాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఇందుకోసం ఆహారంలో మార్పులు చేసుకోవడం, రోజూ వాకింగ్/వ్యాయామం/యోగ, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్‌ఖాన్ చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో స్థానిక ప్రజలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదన్నారు. ఎంతో మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో ఇవేమీ లేకుండా ఆరోగ్యంగా ఉన్న వారే అదృష్టవంతులన్నారు. ఈ మేరకు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణలో ఉంచుకునేందుకు రోజూ వ్యాయామం చేయాలని, ఆహారాన్ని మితంగా తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, 17వ వార్డు కార్పొరేటర్ కె. పద్మలత, సేవా సమితి కాబోయే అధ్యక్షులు విజయమోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రతాపరెడ్డి, సెక్రటరీ యానీ ప్రతాప్, సభ్యులు అపర్ణ, దీప, జి. సుబ్బారెడ్డి, సువర్ణారెడ్డి, జితేంద్ర, ధర్మారెడ్డి, దివాకర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సహదేవరెడ్డి, క్రిష్టఫర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు స్పర్శ దర్శనం కల్పించాలి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు



శ్రీశైల దేవస్థాన చైర్మన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా వచ్చే భక్తులకు శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనం కల్పించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం వెంకటాపురం నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే దంపతులు శ్రీశైలం చేరుకున్నారు. వీరికి దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ 2009 నుంచి ప్రతి శివరాత్రికి పాదయాత్రగా శ్రీశైలం వస్తున్నానని, కరోనా ప్రభావంతో గత రెండేళ్లు రాలేదని చెప్పారు. ఎమ్మెల్యే కాటసానిని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి కలిశారు.

క్రికెట్ విజేత 'ఆదోని డివిజన్'



విజేతగా నిలిచిన ఆదోని జట్టుతో విద్యుత్ ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు సర్కిల్ డే దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆదోని డివిజన్ విజేతగా నిలిచింది. మార్చి 11, 12వ తేదీల్లో సర్కిల్‌డే సంబరాలు జరిపేందుకు ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించాలని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ముందుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. శనివారం ఉదయం కర్నూలు–నంద్యాల డివిజన్లలో కర్నూలు డివిజన్ విజేతగా నిలవగా మధ్యాహ్నం కర్నూలు సర్కిల్ – ఆదోని డివిజన్ల మధ్య జరిగిన పోటీలో ఆదోని గెలిచింది. ఆదివారం స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో కర్నూలు– ఆదోని డివిజన్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కర్నూలు డివిజన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగి 20 ఓవర్లతో 124/3 పరుగులు చేసింది. తరువాత లక్ష్య ఛేదనలో ఆదోని డివిజన్ 125/5 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విజేత టీమ్‌ను విద్యుత్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సుధాకర్‌కుమార్, ఏడీఈ రంగస్వామి అభినందించారు. వీరికి సర్కిల్ డే రోజున బహుమతులు ప్రదానం చేయనున్నారు.

చురుగ్గా వంతెన పనులు

కోడుమూరు రూరల్: కోడుమూరు–ఎమ్మిగనూరు రహదారిలో వర్కూరు వద్ద తుమ్మలవాగుపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు సేఫ్టీ నిధులు రూ.2.30 కోట్లతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. తుమ్మలవాగుపై వంతెన లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకు వరదనీరు పోటెత్తి రోడ్డుపై ప్రవహిస్తుండడంతో కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూసే పరిస్థితి ఉంది. ఈ సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో గతేడాది నవంబర్ 25 పనులను చేపట్టారు. మార్చినెలాఖరులోగా పనులు పూర్తి చేయనున్నట్లు ఆర్అండ్‌బీ డీఈఈ శివరుద్రకుమార్ తెలిపారు.

ఆర్‌యూలో ఆరుబయట భోజనాలు

- పీజీ విద్యార్థుల డైనింగ్ హాలు మూత



రాత్రి ఆరుబయట భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు డైనింగ్ హాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు. వర్సిటీ హాస్టళ్లలో పీజీ, బీటెక్ చదువుతున్న విద్యార్థులు సుమారుగా 400 మందికిపైగా ఉంటున్నారు. వీరిలో ప్రతి రోజు 350 నుంచి 370 మంది హాస్టల్ భోజనశాలలో భోజనాలు చేస్తుంటారు. గతంలో పీజీ, బీటెక్ విద్యార్థులకు వేరు వేరుగా డైనింగ్ హాలు ఉండేది. అయితే రెండు చోట్ల భోజనాలు చేసేందుకు సరిపడ వంట మనుషులు లేకపోవడంతో పీజీ విద్యార్థుల డైనింగ్ హాలు మూత వేసి, బీటెక్ విద్యార్థుల డైనింగ్ హాలులో భోజనాలు పెడుతున్నారు. సామర్థ్యం తక్కువగా ఉండడంతో రాత్రి వేళల్లో ఆరుబయటకు వచ్చి భోజనాలు చేయాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుందరానంద పుచ్చను వివరణ కోరగా పీజీ, బీటెక్ విద్యార్థులు ఒకేసారి భోజనానికి రాకుండా కొంత గ్యాప్ తీసుకొని రావాలని సూచించామన్నారు. డైనింగ్ హాలు సామర్థ్యం ఎక్కడైనా ఇలాగే ఉంటుంది, వేరు వేరు డైనింగ్ హాల్స్ ఉంటే పిల్లలపైనే భారం పడుతుందన్నారు. బీటెక్ విద్యార్థులు సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా కొత్త హాలు నిర్మించే ఆలోచనలు చేస్తున్నామన్నారు.

కొత్తూరులో భక్తజన సందడి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. మాఘమాసం కావడంతో భక్తులు తరలివస్తున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు పిండి పదార్థాలు తయారు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

పలువురు విరాళం

కర్నూలులో నివాసముంటున్న ఈర్నపాడు గ్రామానికి చెందిన పిట్టం నాగ సుధాకర్‌రెడ్డి రూ.50వేలు , పిట్టం తరలితరెడ్డి రూ.10 వేలు, నంద్యాల పట్టణానికి చెందిన ధరణి నాగేంద్ర రూ.10వేలను అన్నదాన పథకానికి విరాళంగా ఇచ్చినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన ఆకుమళ్లబాబు 5 గ్రాముల బంగారు పడిగెను వితరణగా ఇచ్చారు.

వందశాతం ఫలితాలే లక్ష్యంగా..

- ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న గురుకుల విద్యార్థులు
- నమూనా పరీక్షలతో భయం తొలగిస్తున్న అధ్యాపకులు

కల్లూరు: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాది వందశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించి మెరుగైన ఫలితాలు సాధించేలా వారికి నమూన పరీక్షలు జరుపుతున్నారు. మండల పరిధిలోని చిన్నటేకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, అదే క్యాంపస్‌లో అంబేడ్కర్ ఎస్‌ఐటీ–నీట్ అకాడమి ఉంది. ఈ రెండింటిలో ఇంటర్ ఫస్ట్, సెకండియర్ చదువుతున్న విద్యార్థులు 487 మంది ఉన్నారు. వీరికి మార్చి 15 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల అకాడమీ/కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి తెలిపారు.

5న తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 5 వ తేదీ స్థానిక బి.క్యాంపులోని టీజీ వెంకటేష్ కళ్యాణ మండపంలో తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో సంయుక్త కార్యదర్శి టీ. వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు టీ వెంకటేష్ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మగుండేశ్వర క్షేత్ర చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆలయ చైర్మన్, అతిథులు

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని మహిమాన్విత శైవ క్షేత్రం బ్రహ్మగుండంపై ప్రముఖ రచయిత్రి, కేవీఆర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి రచించిన 'కామేశ్వరీదేవి సహిత బ్రహ్మగుండేశ్వర క్షేత్ర చరిత్ర' పుస్తకావిష్కరణ ఆదివారం అట్టహాసంగా జరిగింది. క్షేత్రంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం సారథ్యంలో సరసం మహిళా వేదిక పక్షాన ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభాధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ ఆర్‌కే శర్మ పుస్తక రచనా శైలి, పుస్తకంలోని పలు ప్రతులను చదివి వినిపిస్తూ రచయిత్రిని అభినందించారు. ఆలయ ఈఓ హనుమంతరావ్, ధర్మకర్తల మండలి చైర్మన్లు మాట్లాడుతూ బ్రహ్మగుండం క్షేత్ర మహిమ నలుదిశలా వ్యాపించేందుకు కృషి చేస్తున్న రచయిత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రచయిత్రి మాట్లాడుతూ బ్రహ్మగుండేశ్వరుని చరిత్ర రాయడం తన పూర్వజన్మ సుకృతమని, క్షేత్ర విశేషాలను భావి తరాలకు తెలియజెప్పడం బాధ్యతగా రచన చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, ఉప్పరి సంఘం ప్రతినిధులు, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆయకట్టుదారులు పాల్గొన్నారు.

ఘనంగా మస్తానయ్య ఉరుసు

కోడుమూరు రూరల్: మండలంలోని కృష్ణాపురంలో శ్రీహజరత్ మస్తానయ్య స్వామి ఉరుసును పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం గ్రామస్తులు కిస్తీ నిర్వహించారు. పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లలో ఫలహారం తీసుకొచ్చి మస్తానయ్య స్వామికి సమర్పించారు. గ్రామ సర్పంచు శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు శంకర్‌రెడ్డి, హనుమంతు, శివరాముడు, షేక్షావలి, దస్తగిరి, రవికుమార్‌రెడ్డి తదితరులు స్వామికి ప్రత్యేక చదివింపులు చదివించారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన జయరాముడుపై ఆదివారం అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితపై రాత్రి వేళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.


అలరించిన ఘంటసాల నాటకం



ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రముఖ గాయకుడు ఘంటసాల శతాబ్ది గాయకునిగా పాడిన, సంగీత దర్శకత్వం వహించిన పాటలు సంగీత ప్రియులకు మధురానుభూతిని కలిగిస్తాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఘంటసాల సంగీతం అభ్యసించేందుకు విజయనగరం వెళ్లి పడిన ఇబ్బందులను సాయి సంతోషి నాట్యమండలి కళాకారులు ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో నాటకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఘంటసాల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటకం ప్రారంభించిన కొద్ది కాలంలోనే పేరు ప్రతిష్ఠలు సంపాదించడం విశేషమన్నారు. విజయనగరం వెళ్లిన ఘంటసాన కష్టాలు తెలుసుకుంటే కన్నీళ్లు తెప్పిస్తాయన్నారు. సంగీతం, నాటక రంగానికి ప్రోత్సాహం అందించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని, దీనికి భాస్కరని సత్యజగదీష్ (హైదరాబాదు) సంగీతం, దర్శకత్వం వహించారని వెల్లడించారు. అనంతరం దర్శకులు సత్యజగదీష్ దంపతులను, సంతోషి నాట్యమండలి అధ్యక్షుడు సురభి సంతోష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు మహమ్మద్ మియా, చంద్రకంటి మద్దయ్య, హెచ్ చంద్రన్న, ఎస్.ఎండి. ఇనాయతుల్లా, లక్ష్మీ కాంతారావు, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌ను తప్పించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఎస్ఐ చర్చి సభ్యులు

కర్నూలు (టౌన్): స్థానిక స్టేట్‌బ్యాంకు సర్కిల్ సమీపంలో ఉన్న సీఎస్ఐ చర్చి వద్ద ఆదివారం పాస్టర్ బెంజిమెన్‌ను తక్షణం తప్పించాలని డిమాండ్ చేస్తూ చర్చి సభ్యులు బాబురాజు, మనోహర్‌బాబు, బెనిడిక్ట్, రాణీ తదితరులు డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని, వ్యంగ్యంగా మాట్లాడి కించ పరిచారని ఆరోపిస్తూ వారు పాస్టర్‌ను అడ్డుకున్నారు. బ్యానర్ ప్రదర్శిస్తూ ఈ పాస్టర్ మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. అప్పటికే గొడవ జరుగుతున్న విషయం పోలీసులకు సమాచారం రావడంతో చర్చి వద్దకు చేరుకొని ఇరు వర్గాలను సముదాయించి నచ్చ చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఆదివారం సీఎస్ఐ చర్చిలో అనుచిత వ్యాఖ్యలు చేసి స్త్రీలను అవమానించిన పాస్టర్ బెంజిమెన్ విషయంపై నంద్యాల డయాసిస్ బిషప్ పుష్పలలిత, డయాసిస్ ఉపాధ్యక్షులు రెవరెండ్ వర ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సంఘం కమిటీలోని కొంత మందితో పాస్టర్ కుమ్మక్కై కానుకలను విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు రూ.2.65 లక్షలు తీసుకొని వివరాలు అడిగితే చెప్పడం లేదన్నారు. కొత్తగా వచ్చిన శ్మశాన వాటికకు రూ.45 లక్షలు ఖర్చు చేసి వివరాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో చర్చికి చెందిన సభ్యులు పి.సుశీల, జ్యోతి, జి.ప్రవీణ్, దానియేలు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నందవరం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆరూఢజ్యోతి శాంతాశ్రమ మఠం పీఠాధిపతి సద్గురు శ్రీ నిజానంద మహాస్వామి, ఉరువకొండ మఠం పీఠాధిపతి శ్రీ కరిబసవ రాజేంద్ర స్వామి, శ్రీ సిద్ధారూఢ ఆశ్రమం మాతా శ్రీ జ్ఞానేశ్వరీదేవి, శివరామ ఆశ్రమం మఠం పీఠాధిపతి అభినవ శ్రీ శంకర నందస్వాములు సూచించారు. ఆదివారం నందవరంలో సత్సంగ సువిచార సమితి ఆధ్వర్యంలో శ్రీ నిజానంద స్వాముల 331వ తులాభార సేవలో భాగంగా భక్తులకు ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శరణ బసవేశ్వర స్వామి మఠంలో స్వామికి వేకువజామున ఫల, పుష్పాలు సమర్పించి విశేష పూజలు గావించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తులకు ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తాదులు పాల్గొన్నారు.